# తప్పటడుగు

శ్రీ బోయిన వెంకటేశ్వరరావు

ఇంటర్వెల్‌లో లైట్లు వెలిగినవి. కథ మంచి బిగువు మీద నడుస్తున్నది. లైట్లు వెలిగీ వెలగడంతోనే అందరూ ఒక్కసారి లేచుకున్నారు. శంకరం పక్కనే కూర్చున్న సరోజ తలతిప్పి చూసింది. అంతే నిశ్చేష్టురాలై పోయింది. తన ముందు వరసలో ఒక పక్కగా కూర్చున్న మాధవరావు, తెల్లనిగా టర్లిన్ సూటులో టక్ చేసుకుని, తన వంకే చూస్తున్నాడు. "ఏం సరోజా! అల్లా అయిపొయ్యావ్ ఏమిటి అన్న శంకరం మాటలు, సరోజను ఈ లోకంలో పడవేసినవి. ఓపిక కూడగట్టుకుని, తడబడుతూ "ఏం లేదండీ" అని మాత్రం అనగలిగింది. యింతలో లైట్లారిపోయినవి. మామూలుగా సినిమా నడుస్తున్నది. కాని సరోజ మనస్సు ఆరు సంవత్సరాల వెనుకకు నడుస్తున్నది అప్పటి సంఘటనలు యాధృచ్ఛికంగా ఒకటి తర్వాత ఒకటి రీలులా కదిలిపోతున్నది.

.... .... .... .... .... .... .... .... .... ....

తమ వూరి నుంచి హైస్కూలు కెళ్లాలంటే, కాలవ గట్టమ్మట మూడు మైళ్లు నడిచి వెళ్లాలి. పొద్దున్నే తొమ్మిది గంటలకల్లా భోంచేసి, టిఫిను క్యారియర్‌లు పుచ్చుకుని అందరూ కలసి పదిమంది బయలుదేరేవాళ్లు. అందులో లీలా, రమా, తను తప్ప మిగిలిన వాళ్లంతా మగపిల్లలే. మాధవరావు కరణంగారబ్బాయి. మంచి స్ఫురద్రూపి. వాళ్ల స్కూలుకి ఎస్. పి. యల్. తను ఫోర్తుఫారం చదువుతుంటే అతను ఎస్ ఎస్.యల్.సి. అందరూ అతనంటే బాగా అభిమానం చూపేవారు.

ఒకరోజు పొద్దున్నే, అక్క హడావిడిగా కేకేసింది "అమ్మా! యిటు రావే ధీన్ని చూడు" అని. ఆ రోజు తనను చాపలమీద కూర్చోబెట్టారు, అమ్మలక్కలంతా వచ్చారు. పేరంటం అయింతర్వాత చిమ్మిలి, తాంబూలం తీసుకుని తనతో పరిహాసాలాడి వెళ్లిపొయ్యారు. ఏమీ తెలియని వయస్సు. తనకంతా కొత్తగా వుంది. కాని వాళ్లంతా అట్లా అంటూంటే తన కెంతో సిగ్గేసింది. పదకొండో రోజున తనకు నీళ్లుపోసింతర్వాత మామూలుగా తను బడికి బయలుదేరింది. అమ్మ "ఎక్కడికే పుస్తకాలుచ్చుకు బయలుదేరా" వంది. "ఎక్కడికేమిటే బడికెళ్తున్నా" అంది. "చాల్లే ఎవరన్నా వింటే నవ్విపోగలరు, పిచ్చి పిల్లా! ఆ పుస్తకాలక్కడ పడేసి ఆ లేసులు కుట్టుకో" అంది. అప్పటినుంచి తన చదువుకు స్వస్తి. మొదట్లో యింట్లో కూర్చోటం సోమరితనంగా కనపడినా క్రమక్రమంగా పుస్తకాలతో కాలక్షేపం అలవాటయిపోయింది. ఎండాకాలం వచ్చేసింది. లీల ఒకరోజున వచ్చి పరీక్షలయిపోయి బడికి సెలవులిచ్చేశారని చెప్పింది. తను కూడా లీలతో ఫోర్తుఫారం ప్యాసయి యుండును గదా అని బాధ పడింది. ఒక రోజు సాయంకాలం తను చెరువుగట్టుకి నీళ్లకని వెళ్లింది. నీళ్లు తీసుకుని వస్తుంటే మాధవరావు పొలంనుంచి గామోసు వస్తున్నాడు "ఏం సరోజా! కులాసాగా వున్నావా?" అని ప్రశ్నించాడు మాధవరావు. ఎందుకనో తనకెంతో సిగ్గేసింది మాధవరావుతో మాట్లాడటానికి. "అబ్బో అమ్మాయిగారికి సిగ్గెక్కువయిందే" అంటూ నవ్వుకుంటూ వెళ్లిపొయ్యాడు మాధవరావు. ఇంటికి వచ్చింతర్వాత, 'మాట్లాడనందుకు మాధవరావు ఏమనుకున్నాడో' అని తను చాలా బాధపడింది. ఆ రోజు రాత్రి పన్నెండయినా తనకింకా నిద్రపట్టలేదు ఇంట్లో ఉక్కగా వుందని దొడ్లోకెళ్లి వెన్నెల్లో, బావి పళ్లెంమీద కూర్చుంది. పైన చంద్రుడు చల్లగా వెన్నెల్ని కాయిస్తుంటే, ఏవేవో వింత ఆలోచనలు వస్తున్నవి. నక్షత్రాలు మిణుకు మిణుకు మని ప్రకాశిస్తూ, చంద్రుడి కాంతి ముందు వెలా వెలా పోతున్నవి ఆ మహాయానిలయాల్లో. చంద్రుడ్ని చూస్తూ, అలాగే ఎంతోసేపుండిపోయింది. ఇంతలో బాదంచెట్టు దగ్గర ఏదో అలకిడయింది, అటు చూసింది. మాధవరావు, కంగారు పడవద్దన్నట్టు "ఇస్" అని సంజ్ఞ చేసాడు. తనకొక్కసారిగా ఆశ్చర్యం, భయం కూడా కలిగినవి. ఇంత రాత్రిప్పుడు మాధవరావెందు కొచ్చాడా? అని "సరోజా! సాయంత్రం నిన్ను చూచినప్పటినుంచి, నిన్ను చూడకుండా వుండలేకపోయాను. ఏమయితే అయిందని మీ పిట్టగోడ దూకి వచ్చేశాను" అన్నాడు. మాధవరావు తనేదో చెప్పాలనుకొంది. కాని నోరు పెగల్లా. మాధవరావు ఒక్కసారిగా తనను గట్టిగా కౌగలించుకొని, ముఖంనిండా ముద్దులు కురిపించాడు. ఏమంటానికి తనకు మాట రాలేదు. మాధవరావు విడిచే, వెచ్చని ఉచ్ఛ్వాసనిశ్వాసాలు తన ముఖానికి వెచ్చగా తగిలినవి. అతని కౌగిలి ఏదో కమ్మని అనుభూతిని, స్పర్శ సౌఖ్యాన్ని కల్గించింది. మాధవరావు క్రమంగా తన శరీరాన్నంతటినీ ఆక్రమించుకున్నాడు తను అడ్డు పెడదామనుకుంది కాని ఎప్పుడూ అనుభవించని ఏదో సౌఖ్యం తననా పని చెయ్యనియ్యలా కొంతసేపటికిగాని తనుచేసిన పాపం తను గ్రహించలేక పోయింది. భీతి, రోత, లజ్జ అన్నీ ఒక్కసారిగా తన నావహించినవి. మొఖాన్ని రెండు చేతులతో కప్పుకుని ఇంట్లోకి పరిగెత్తుకు పోయింది ఆ రాత్రంతా ఏడ్చి ఏడ్చి తన కళ్లు వాచినయి. మర్నాడు పొద్దున్నే తనను చూసి, అమ్మ, "ఏమే అలా వున్నావు కళ్లేమిటి, అలా ఎఱ్ఱగా వాచినయి?" అనడిగింది. "ఏం లేదమ్మా, వేడిచేసినట్టుంది" అంది తను. ఒక నెల గడిచిపోయింది, ఒక రోజు మధ్యాహ్నం తనకు డోకులు, వాంతులు పట్టుకున్నాయి. అన్నం సహించటం లేదు. "ఏమ్మా! రెండు మెతుకులు కూడా ఎంగిలి పడటం లేదే" అని అమ్మ తనెన్నోసార్లు గుచ్చి గుచ్చి అడిగింది.

( తరువాయి 19 వ పేజీలో )

## తప్పటడుగు

(10 వ పేజీ తరువాయి)

ఏం లేదని తప్పించుకుంది తను. క్రిమేపీ తన కడుపు ఎత్తుగా పెరగడం చూచి, అమ్మ సందేహించింది. ఒకరోజున తనను డాక్టరుకి చూపించడానికి అమ్మ పట్నం తీసికెళ్ళింది. అసలు సంగతి తెలిసిపోయింది. డాక్టరు తనకు మూడో మాసం గర్భిణీ అని చెప్పింది. తనతండ్రి, ఈ సంగతి నలుగురికి తెలిస్తే ఏం అప్రతిష్ఠ వస్తుందోనన్న భయంచేత, ఏదో సాకు చెప్పి, అప్పాళ్ళొంచి మకాం ఎత్తేసి పట్నానికి మార్చారు. తొమ్మిది మాసాలు పూర్తికాగానే, పుట్టిన పిల్లని నర్సింగ్ హోమ్‌లో వదిలేసి, బయటకు వచ్చేటప్పటికి అయిదారొందలయినయి. ఇంకో రెండు, మూడు నెలలకి ఈ శంకరం వచ్చాడు తనను చూట్టానికి. పెళ్ళిఖాయమయింది. వాళ్ళడిగిన కట్నానికి, రెండో మాట అనకుండా ఒప్పుకున్నారు అమ్మా నాన్నా. తర్వాత ఈ విషయం జ్ఞాపకమొచ్చినప్పుడల్లా ఎంతో బాధపడింది తను. క్షణికోద్రేకంలో, తనకు తాను పాపపంకిలంలో దిగింది. ఎప్పుడూ మొహంమీద చిరునవ్వు తొణికిసలాడ్తూ, తనతో సరదాగా కబుర్లు చెప్తుండే భర్త పవిత్ర హృదయాన్ని చూసినప్పుడల్లా, తన భర్తకు తాను ద్రోహం చేస్తున్నానేమోనని, మనస్సంతా కలతపడేది. కానీ క్రమంగా అన్నీ మర్చిపోవటానికి ప్రయత్నించింది. ఈ అయిదేళ్ళనుంచి తన కాపరం, ఏ అరమరికలు లేకుండా, హాయిగా సాగిపోతున్నది. తనంటే శంకరానికెంతో ప్రాణం. ఆఫీసు నుంచివస్తూ పువ్వులో, మిఠాయో తప్పకుండా తెస్తాడు. కొత్త సినిమావస్తే, తనులేకుండా ఎప్పుడూ ఒంటరిగా వెళ్ళేవాడుకాడు. మళ్ళా ఇన్నేళ్ళ తర్వాత మాధవరావిలా కనపడటం, తన భావిజీవితంలో ఏదయినా సుడిగాలి చెలరేగటానికి నాంది వంటిదేమోనని వణికిపోయింది. "ఏం సరోజా! అలానే కూర్చుండిపోయ్యావు, లే." అన్న శంకరం మాటలు తనను తెప్పరిల్లచేశాయి. సినిమా అయిపోయింది. అందరూ వెళ్ళిపోతున్నారు. తను గబగబాలేచి శంకరంతో నడిచింది. ఇంతలో శంకరం, "సరోజా! ఆ మూల నుంచుని సిగరెట్ తాగుతున్నాడే, అతనే మా ఆఫీసు కొత్త మేనేజర్" అని చూపించాడు. సరోజ అటు చూసింది. మాధవరావు, శంకరం తన తప్పునే వేలెత్తి చూపుతున్నట్టనిపించింది. "ఏం ఒంట్లోబాగాలేదా, ఇంటర్వెల్ నుంచి అలానే వున్నావు. అని లాలింపుగా అని, శంకరం రిక్షాను పిల్చి, ఇద్దరూ అందులో కూర్చున్నారు.

.... .... .... .... .... .... .... .... .... ....

మర్నాటి నుంచి అన్ని పనుల్లోనూ అలాగే వుంది సరోజ. ఏవేవో పాత జ్ఞాపకాలు మనస్సునంతా వికలపరుస్తున్నవి. ఆఫీసు వేళకి వంట అవటంలేదని, రెండు మూడు సార్లు విసుక్కున్నాడు శంకరం. ఎప్పుడూ లేంది, "ఏమాట అడిగినా, బెల్లంకొట్టిన రాయిలా, అలా శూన్యంలోకి చూస్తావే" అని ఒకరోజు గదుముకున్నాడు. సరోజకు గుడ్లంట నీళ్లు తిరిగినవి. అట్లా అన్నందుకు శంకరం వెంటనే బాధపడ్డాడు. ఆరోజు రాత్రి, "ఏం సరూ! నువ్వెప్పుడూ అలా పరధ్యానంగా వుంటున్నావు కారణం ఏమిటో నాతో చెప్పవూ?" అని బుజ్జగించాడు "ఏం లేదండీ, ఏం లేదు" అంది తను లేని నవ్వును తెచ్చి పెట్టుకుంటూ. "అహా! నా దగ్గరేదో దాస్తున్నావు. ఏం లేకపోతే ఎప్పుడూ నవ్వుతుండేదానివి ఈ వారం రోజుల్నుంచి ఎందుకని విచారంగా వుంటున్నావు? మీవాళ్లెవరన్నా జ్ఞాపకం వచ్చారా?" అన్నాడు శంకరం. "ఛా, లేదండీ ఇదంతా వుట్టి మీ అనుమానమే," అంది సరోజ పెదాలతో నవ్వుతూ. కాని ఆ ముఖాన్ని బట్టి ఇట్టే గ్రహించేశాడు శంకరం, సరోజ ఏదో బాధతో తనలోతానే సతమతమవుతున్నదని.

.... .... .... .... .... .... .... .... .... ....

గోరుచుట్టుమీది రోకటిపోటులా, ఓ రోజు సాయంత్రం, తన ఆఫీసు కొత్త మేనేజర్ మాధవరావుని టీకని ఆహ్వానించి, తనవెంట తీసుకొచ్చాడు శంకరం. భర్తతో కూడా వస్తున్న మాధవరావుని చూడగానే, సరోజకు తలమీద పిడుగులుపడ్డట్టయింది. శంకరం లోపలికొచ్చి, "సరోజా! ఈయన మా ఆఫీస్ కొత్త మేనేజరు మాధవరావు యమ్. ఎ., తొందరగా ఏదన్నా ఇంత టిఫినుచేసి పట్రావాలి" అని వెళ్లిపొయ్యాడు. "నేను చెయ్యలేనండీ" అని చెప్దామనుకున్న సరోజ మాటలు గొంతు పెగిలి బైటకు రాలేదు. దగ్గర్లో వున్న బల్లమీద కూలబడి పోయింది. పది నిముషాలాగి లోపలికొచ్చిన శంకరం, అప్పటి నుంచి అలానే వుండి పోయిన సరోజను చూసి ఆశ్చర్యపొయ్యాడు టిఫిను చెయ్యలేదని తెలుసుకుని, "సరే, ఆ ఫ్లాస్కులో వున్న టీ, అన్నా ఇటు పట్టుకురా" అని విసురుగా వెళ్లిపొయ్యాడు. సరోజలేచి, ఫ్లాస్కులోవున్న టీ రెండు గ్లాసుల్లోపోసి పుచ్చుకుంది. చేతులు రెండూ వణుకుతున్నయి. "ఇదేమి విషమపరీక్ష భగవాన్" అనుకుంది. కాళ్లు తడబడుతుంటే, రెండు గ్లాసులూ పుచ్చుకుని గదిలోకి వెళ్ళింది. మాధవరావు, శంకరం ఏవో ఆఫీసు విషయాలు మాట్లాడుకుంటున్నారు. సరోజ గదిలో కాలుపెట్టగానే, సరోజ ముఖంవంక చూసాడు మాధవరావు. సరోజకూడా, అప్పుడే తలెత్తి మాధవరావు వంక చూసింది. తన కళ్లలోకి సూటిగా చూస్తున్న మాధవరావు కళ్లు, "మన పాత కలయిక జ్ఞాపకముందా.?" అని ప్రశ్నిస్తున్నట్లు తోచింది. సరోజకు తల తిరిగింది. చేతిలోని రెండు గ్లాసులు, తనకు తెలియకుండానే జారిపోయినవి నేలమీద దొర్లుతున్న, 'టీ' "నీ సంగతినాకు తెలుసులే" అని వికటంగా నవ్వుతున్నట్లనిపించింది సరోజకు. గిరుక్కున వెనక్కుతిరిగి, ఇంట్లోకి వెళ్లి మంచంమీదపడి ఏడ్చింది. అప్పుడు దాకా మామూలుగా మాట్లాడుతున్న మాధవరావు మొహంలో తడబాటు, సముద్రంలో అలలలాగా, స్పష్టంగా కన్పిం

చించి. శంకరానికి సరోజ ప్రవర్తనంతా అయోమయంగా తోచింది. లోలోపల సరోజ మీద కోపంతో మండిపడ్డాడు. మాధవరావు ఈలోగా సెలవుతీసుకుని "వెళ్ళొస్తానని" చెప్పి వెళ్ళిపోయ్యాడు. కోపంతో ధుమ ధుమ లాడుతూ ఇంట్లోకి వచ్చిన శంకరం, సరోజ ఏడుస్తూ వుండటం చూచి విస్తు పోయ్యాడు. మాధవరావు, సరోజా ఒకళ్ల నొకళ్ళు తెల్లబోతూ చూసుకోవటం, మొన్న సినిమా హాల్లో మాధవరావుని చూపిస్తే, సరోజ అదోలా ప్రవర్తించటం, అన్నీ ఒకటి తరువాత ఒకటిగా అతనికి జ్ఞాపక మొచ్చాయి. ఏవేవో అనుమానపు ఛాయ లతన్ని వెంటాడినయి. పైగా మాధవరావు వాళ్ల సొంతవూరు పేరుచెప్పినపుడు, సరోజ పుట్టినవూరు కూడా అదేనని జ్ఞాపకంరాలా. ఇప్పుడు తెలుస్తున్నది. శంకరానికి ఇదంతా గందరగోళంగా వుంది. చికాకుతో, బీచ్ దగ్గరకు పోదామని బయలుదేరి వెళ్ళాడు ఇన్నాళ్ళు ఏ కలతలు లేని తన సంసారంలో, ఇప్పుడు సరోజ ప్రవర్తన, అశుభంగా తోచింది. ఎటు చూచినా ఏదో నిరాశా, నిస్పృహ కనపడుతున్నవి. బాగా పొద్దు గూకింది. నెమ్మదిగా బీచ్‌లో జనం పల్చ బడ సాగారు. కాళ్ళీడ్చుకుంటూ, తను కూడా ఇంటికి చేరాడు. ఇంటికి తాళం వేసి వుండటం అతనికాశ్చర్యాన్ని కల్గించింది. సరోజ ఎక్కడికి వెళ్లిందా ? అని ఆశ్చర్య పడ్డాడు. శంకరం రావటం చూసి, పక్కింటివారి పిల్లవాడు వచ్చి, "పిన్ని గారివి మీరు రాగానే ఇవ్వమన్నారండీ" అని, ఇంటితాళం చెవీ, ఒక ఉత్తరం ఇచ్చాడు. శంకరరావు కంగారుగా ఉత్తరం చింపి చదివాడు.

పూజ్యులైన శంకరరావు గారికి ;

బహుశా ఈ విధంగా సంబోధించి నందుకు మీరు చాలా ఆశ్చర్యపడవచ్చు. కాని మిమ్మల్ని భర్తగా, చెప్పుకోటానికి కూడా అర్హతలేని పాపిని నేను. ఈ పది రోజులనుంచి నేను అదో రకంగా వున్నా నని మీరు చాలాసార్లన్నారు దానికి కారణం చెప్తున్నాను. వినండి. మీరు మనింటికి తీసుకొచ్చిన మీ మానేజర్ మాధవరావు మావూరు వాడే. చిన్నప్పుడు మేమంతా కలసి పొరుగూర్లో వున్న బడికి వెళ్తుండే వాళ్లం. స్కూల్లో చురుగ్గా వుండేవాడని, మావూరు వాడేనని మేమంతా అతన్ని చాలా అభిమానించే వాళ్లం. అవి నేను కొత్తగా పెద్దమనిషయిన రోజులు. అందులో నన్ను బడి మాన్పించారు. కొన్నాళ్ల పోయింతర్వాత, ఓ దురదృష్ట దినాన, గోడదూకి మా దొడ్లో ప్రవేశించిన మాధవరావుకి అనుకోకుండానే స్వాధీన మయి పోయ్యాను ఆ పాపానికి ఫలితంగా నాకో పిల్ల కలిగింది. ఆ పిల్ల నెక్కడో వదిలేసి, నా తల్లిదండ్రులు, మోసంచేసి మీ కిచ్చి నన్ను వివాహం చేశారు. జీవితంలో తెలిసో, తెలియకో క్షణికోద్రేకానికి బానిసనై తప్పటడుగు వేశాను. కాని ఆ పాపపు ఛాయలు నన్ను చాలా కాలం వెంటాడినయి. నిష్కల్మష హృదయులైన మిమ్మల్ని చూస్తుంటే, చాలా సార్లు నేను చేసిన పాపాన్ని మీకు చెప్పుకుని, నా పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకుందామనుకునే దాన్ని. కాని అంత ధైర్యం చెయ్యలేకపోయాను. చివరకు గతాన్ని మరచి, మీసేవల్లో నా కళంకాలను కడుగుకుందామని ఆశించాను. కాని మొన్న మనం సినిమాకి వెళ్ళినప్పుడు హటాత్తుగా మాధవరావు కనపడటంతో నా గత జీవితపు పుటలు నన్ను వెక్కిరించాయి. నా జీవితంమీద నాకే రోత కలిగింది. ఇన్నాళ్ల మీతో చెప్పలేక నాలోనే నిల్చిపోయిన ఈ పాపపు సత్యం, నన్ను విషం బాధించి నట్టు బాధించింది. నేనీ లోకాన్ని విడిచి పోతున్నాను. కాని జన్మజన్మాలకు మీ వంటి పవిత్రులే భర్తగా దొరకాలని ప్రార్థించుతాను. ఈ దుర్భాగ్యురాలి మరణానికి చింతించక, మీరు వేరే వివాహం చేసుకుని సుఖపడాలని నాకడసారి కోరిక.

మీ పాద స్పర్శకు కూడా అర్హతలేని

అభాగ్యురాలు

సరోజ

ఉత్తరం చదివిన రెండు నిముషాల వరకు దిగ్భ్రాంతుడై పోయ్యాడు శంకరం. ఇంకా అక్కడేవున్న పక్కింటబ్బాయిని, "బాబూ ! మీపిన్ని ఎటువెళ్లిందో తెలుసా? ఎంతసేపయింది ? అని ప్రశ్నలవర్షం కురిపించాడు. "ఒక పావుగంట అయిందండీ. రైలుగట్టువేపు వెళ్లారు." అన్నాడాపిల్లాడు. పిచ్చివాడికిమల్లే, "సరోజా ! అని కేకలు పెడ్తూ రైలుపట్టాలవెంట పరిగెత్తాడు శంకరం. ఒకమైలు దూరంవెళ్ళిన తర్వాత. ఒకచోట పట్టాలమీదవున్న నల్లని ఆకారం కనిపించింది. దూరాన రైలు ఇంజన్‌లైట్ల కాంతులు ప్రతిక్షణానికి చేరువవుతున్నవి. వెట్టి ధైర్యంతో, శంకరం ఒక్క ఉదుటున వెళ్లి, ఆ ఆకారాన్ని ఇవతలకు లాగేయటం, రాక్షసిలాశబ్దంచేస్తూ. రైలు వెళ్లి పోవటం ఒక్కసారే జరిగాయి. శంకరాన్ని చూచిన సరోజ, "ఎందుకండీ, ఈ పాపిని బ్రతికించారు ?" అని దావురుమని శంకరం కాళ్లమీద కూలిపోయ్యింది. శంకరం గంభీరంగా, "కాదు సరోజా ; నీ జీవితంలో కొన్ని సంఘటనలు అనుకోకుండా జరిగి వుండవచ్చు. దానిమూలంగా నీవందేళ్ల జీవితం ఒకఅభాగినిలా అంతం కావటం నేను సహించను. నీ హృదయ పూర్వకమైన పశ్చాత్తాపమే నీ నుండి ఆ పాపాన్ని తొలగించింది. పాతవిషయాలన్నీ మర్చిపోయి, ఎప్పటిలాగే నీ జీవితాన్ని, దాంతోపాటే నా జీవితాన్ని తీర్చి దిద్దు" అని లేవదీశాడు. కన్నీళ్లతో శంకరం పాదాలకు అభిషేకంచేసిన సరోజ ఉక్కిరి బిక్కిరవుతూ, "మీరు మానవులు కాదు, దేవతలు" అన్న మాటలు, సన్నగా గాలి హోరులో కలిసిపోయినవి. చీకట్లో ఆ రెండు ఆకారాలు ఒకరినొకరు పట్టుకుని ఇంటికి కదిలిపోయినవి.

——o——